# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 302 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 12, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




4లో...

## ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్

గట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క




### 75 ఏళ్లు నిండినా..

# మోదీనే ప్రధాని


### రిటైర్ అవ్వాలనేది బీజేపీ రాజ్యాంగంలో లేదు

- ఆర్‌ఆర్ ట్యాక్స్ అంటే.. రేవంత్-రాహుల్ ట్యాక్స్
- గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సర్జికల్ స్ట్రైక్స్‌ను సీఎం రేవంత్ ప్రశ్నిస్తున్నారు
- నా ఫేక్ వీడియోతో ఆయన తప్పు చేశారు
- పాలమూరు-రంగారెడ్డి కూడా అవినీతి ప్రాజెక్టే
- కేజ్రీవాల్‌కు సుప్రీం క్లీన్‌చీట్ ఇవ్వలే: అమిత్ షా

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):**
"మోదీకి 75 ఏళ్ల వయసు దాటాక ప్రధాని ఎవరని ప్రశ్నిస్తున్నారు. 75 ఏళ్లు దాటినా మోదీనే ప్రధానిగా ఉంటారు. 75 ఏళ్ల వయసు దాటిన తర్వాత రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలని బీజేపీ రాజ్యాంగంలో ఎక్కడా లేదు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మోదీ రిటైర్ అవుతారా? అంటూ చేసిన వ్యాఖ్యలపై అమిత్‌షా ఈ మేరకు స్పందించారు. మోదీ రిటైర్ అవుతారంటూ ఇండీ కూటమి సంతోషించాల్సిన అవసరమే లేదన్నారు. "మోదీ మూడో టర్మ్ కూడా పూర్తిస్థాయిలో సేవలందిస్తారు. ఆయనతోనే దేశం సుభిక్షంగా ఉంటుంది. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపాలనేది మోదీ లక్ష్యం. కానీ, దేశాన్ని ముక్కలు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది" అని వ్యాఖ్యానించారు. శనివారం వికారాబాద్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో జరిగిన బీజేపీ జనసభల్లో, హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కుటిలనీతికి పాల్పడుతోందని మండిపడ్డారు. "రిజర్వేషన్లను తొలగిస్తామని నేను పేర్కొన్నట్లు వీడియోను ఎడిట్ చేశారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి తప్పు చేశారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో పట్టువస్త్రాలను సమర్పించే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్, ఇండీ కూటమి నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే.

మిగతా.. 2లో

# ష్.. గప్‌చుప్!




- 3 వారాల హెూరాహెూరీ ప్రచారానికి తెర
- హైలైట్‌గా నిలిచిన 'గాడిద గుడ్డు'
- సుడిగాలిని మరిపించిన సీఎం రేవంత్
- మోదీ గ్యారెంటీనే బీజేపీ ట్రంపు కార్డు
- తేలిపోయిన బీఆర్ఎస్ ప్రచారాంశాలు
- హెూరాహెూరీకి తెర!
- అంతా తానైన రేవంత్ రెడ్డి!

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):**
అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రచారానికి కర్త, కర్మ, క్రియగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిచారు. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీ తరపున సుడి గాలి ప్రచారం చేశారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో జన జాతర సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన.. మొత్తం 27 రోజుల్లో 57 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగులు సరేసరి. కొన్ని రోజుల్లో నాలుగైదు రోడ్ షోలు, కార్నర్ మీటింగుల్లోనూ పాల్గొన్నారు. మరికొన్ని సందర్భాల్లో ఒకే రోజు రాష్ట్రంతోపాటు కేరళ, కర్ణాటకల్లోనూ ప్రచారం చేశారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ నామినేషన్ల కార్యక్రమానికి వెళ్లి వచ్చి.. రాష్ట్రంలో అనేక సభల్లో పాల్గొన్నారు. ఇక, కాంగ్రెస్ తరపున పార్టీ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రచారంలో పాల్గొన్నారు. తుక్కుగూడలో రాహుల్ గాంధీ పాల్గొన్న సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్.. చివరి రోజు శనివారం ప్రియాంక గాంధీ ప్రచారంతో ముగించడం విశేషం. ఇక, కాంగ్రెస్ ప్రచారం మొత్తం ఆరు గ్యారెంటీలతోపాటు రుణ మాఫీ చుట్టూ తిరిగింది. కేవలం వంద రోజుల పాలనలోనే హామీ ఇచ్చిన విధంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం రూ.500కే సిలిండర్‌బీ 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తుబీ రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స సీలింగ్ పెంపుబీ ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేశామని కాంగ్రెస్ నేతలు వివరించారు. ఆగస్టు 15వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ మాఫీ పథకాన్ని అమలు చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పదే పదే ప్రకటించారు. ఎక్కడికి వెళితే అక్కడి దేవుడిపై ఒట్టు వేసి మరీ తేల్చి చెప్పారు. దీనిపై హరీశ్, రేవంత్ మధ్య మాటల యుద్ధం కూడా నడిచింది. పంద్రాగస్టులోగా రుణ మాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సవాల్ విసిరితే.. రాజీనామా పత్రంతో సిద్ధంగా ఉండాలని రేవంత్ స్పష్టం చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రచారంలో 'గాడిద గుడ్డు' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణకు బీజేపీ ఏమీ ఇవ్వలేదనే విషయాన్ని సింబాలిక్‌గా చెబుతూ కాంగ్రెస్ పార్టీ వినూత్న ప్రచారానికి తెరలేపింది. చివర్లో, సీఎం రేవంత్ కాంగ్రెస్ ప్రచారాన్ని కొత్త మలుపు తిప్పారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెంచుతామంటూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడంతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని తిరగ రాస్తుందని, అందుకే తమకు 400 సీట్లు ఇవ్వాలని అడుగుతోందని విమర్శలు ఎక్కుపెట్టారు. నిజానికి, ఆ తర్వాత దేశవ్యాప్తంగా

మిగతా.. 2లో



## ఎన్నికల్లో కాంగ్రెస్‌నే ఆశీర్వదించండి

- వీడియో సందేశంలో సిఎం రేవంత్ వినతి

**హైదరాబాద్,మే11(నమస్తే ఉదయం):**
సార్వత్రిక సమరానికి మరి కొన్ని గంటలే మిగిలి ఉన్న వేళ.. సీఎం రేవంత్ రెడ్డి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని, ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజలకు విన్నవించారు. 'ఇవి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రిజర్వేషన్ల వల్లే పురోగమన దిశలో పయనించారు. రాజ్యాంగం మార్చాలని బీజేపీ

మిగతా.. 2లో




## ముగిసిన నాలుగోదశ ఎన్నికల ప్రచారం

- శనివారం సాయంత్రం 6గంటలకు మైకులు బందు
- ప్రచారంతో హోరెత్తించిన రాహుల్, ప్రియాంక, నడ్డా, అమిత్ షా
- తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు పోలింగ్
- ఏపీలో 17 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు
- జోరుగా ప్రచారం చేసిన కూటమి నేతలు..సిఎం జగన్
- రెండు రాష్ట్రాల్లోనూ మూతపడ్డ మద్యం, కల్లు దుకాణాలు

**న్యూఢిల్లీ,మే11(నమస్తే ఉదయం):**
దేశవ్యాప్తంగా నాలుగోదశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో కూడా మైకులు మూగబోయాయి. చివరి రోజున ప్రచారాలతో హోరెత్తించారు. చివరి రోజు అమిత్ షా, నడ్డా, రాహుల్ గాంధీ,ప్రియాంకలు ప్రచారంతో మోరెత్తించారు. జగన్, చంద్రబాబు., పవన్ కళ్యాణ్‌లు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మూడు దశల్లో

మిగతా.. 2లో

### సొంతూరులో ఓటేద్దాం..

# చలో చలో

- ఓటేసేందుకు బయలుదేరిన నగరవాసులు
- విజయవాడ హైవేపై వాహనాల రద్దీ
- భారీగా ధరలు పెంచేసిన ప్రైవేట్ ట్రావెలర్స్
- విజయవాడ బస్సుల కోసం కిటకిటలాడిన బస్టాండ్లు

**హైదరాబాద్,మే11(నమస్తే ఉదయం):**
హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు, ఉపాధి కోసం వచ్చి స్థిరపడ్డవారు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూళ్లకు బయలు దేరారు. శనివారం నుంచి మూడు రోజులు సెలవులు కావడంతో సొంతూళ్లకు వెళ్లారు. దీంతో విజయవాడ హైవే

మిగతా.. 2లో





### ప్రతిపక్షహోదా కూడా...

## కాంగ్రెస్‌కు దక్కదు

- ఎన్‌డిఎ కూటమి 400 సీట్లు గెలుస్తోంది
- ఒడిషాలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తున్నాం
- ఒడిషా ప్రచారంలో ప్రధాని మోడీ వెల్లడి

**భువనేశ్వర్,మే11(నమస్తే ఉదయం):**
వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ప్రధాని మోడీ ఘాటుగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తొలిసారి ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సాధించి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మే ఒడిశాలో కీలకమైన లోక్‌సభ, అసెంబ్లీ



ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంధమాల్‌లో శనివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లలో ఎన్డీయే గెలువనుందని, విపక్షంలో కూర్చునేందుకు అవసరమైన సీట్లు కూడా కాంగ్రెస్‌కు రావని చెప్పారు. 'జూన్ 4న ఎన్డీయేకు 400కు పైగా సీట్లను కట్టబెట్టేందుకు దేశ ప్రజలు స్థిరనిశ్చయంతో ఉన్నారు.

మిగతా.. 2లో



### పార్లమెంట్ ఎన్నికలకు

## కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

- నిష్పక్షపాతంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు
- మీడియాకు తెలంగాణ డీజీపీ రవిగుప్తా వెల్లడి

**హైదరాబాద్,మే11(నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికల కోసం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలంగాణ డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఎన్నికలు నిష్పక్ష పాతంగా నిర్వహించడానికి విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లను చేశామన్నారు. ఎన్నికల్లో భద్రత నిమిత్తం 73 వేల 414 సివిల్ పోలీసులు, 500 తెలంగాణ స్పెషల్ పోలీస్ బలగాలు,164 కంపెనీల సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, తమిళనాడుకు చెందిన మూడు స్పెషల్ ఆర్మ్ ఫోర్స్, 7000 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన హోంగార్డులు ఎన్నికల భద్రత విధుల్లో ఉంటారని చెప్పారు. అక్రమ మద్యం రవాణాను నిరోధించడానికి ప్రత్యేకంగా మొబైల్ టీమ్ లను ఏర్పాటు చేశామన్నారు డీజీపీ

మిగతా.. 2లో

### కాంగ్రెస్ మూల్యం

## చెల్లించుకోబోతోంది

- ఎక్కడా ప్రజాస్పందన లేకుండా సభల నిర్వహణ
- నా రాజకీయ అనుభవంతో చెబుతున్నా..మేం గెలుస్తున్నాం
- కాంగ్రెస్, బిజెపిలకన్నా మాకే ఎక్కువ సీట్లు వస్తాయి
- రాష్ట్ర ప్రగతిని పక్కన పెట్టిన సీఎం రేవంత్
- చిల్లర రాజకీయాలతో అభాసుపాలు చేస్తున్నారు
- మీడియా సమావేశంలో కెసిఆర్ వెల్లడి

**హైదరాబాద్,మే11 (నమస్తే ఉదయం):**



తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించ బోతోందని, ఆ పార్టీపై ప్రజల ఆగ్రహంతో ఉన్నారని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పాలనలో విఫలం అయ్యారని, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రం ఎలా ముందుకు వెళ్లాలో ఆలోచించడం లేదన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టిందని, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఏయే రంగాల్లో ఏం చేయ బోతున్నారో చెప్పలేదు. అమూల్య సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వెచ్చిస్తున్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు విడుదల చేసి, ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. రాష్ట్ర పురోగతి గురించి అసలు మాట్లాడలేదు. ఆ వైఫల్యమే కాంగ్రెస్

మిగతా.. 2లో



### రాజ్యాంగాన్ని మార్చడమే

## బిజెపి లక్ష్యం

- రిజర్వేషన్లు తొలగించడమే బీజేపీ కర్తవ్యం
- బిజెపి వస్తే మళ్లీ నిరంకుశ విధానాలు
- హిందూ-ముస్లింలు కొట్లాడుతుంటే ఆనందించే పార్టీ
- పటాన్చెరు ప్రచారంలో సిఎం రేవంత్ విమర్శలు
- నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు

**హైదరాబాద్,మే11(నమస్తే ఉదయం):**
దేశం సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే లక్ష్యంతో భాజపా ఈ ఎన్నికల్లో ముందుకెళ్తోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

మిగతా.. 2లో

# ష్.. గప్‌చుప్!

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ ప్రచారంలో ఇవే కీలకాంశాలుగానూ మారాయి. ఇదే అంశంలో డీప్ ఫేక్ వీడియో తెరపైకి రావడం.. దీనిపై సీఎం రేవంత్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.

ప్రచారం ముగిసింది! ప్రసంగాలకు తెరపడింది! ప్రలోభాలు సరేసరి! ఓటరు ప్రసన్నంపైనే అంచనాలు మిగిలాయి! దాదాపు మూడు వారాలపాటు హోరాహోరీ ప్రచారం ముగిసింది. ఎన్నికల యుద్ధంలో అన్ని పార్టీలూ అలుపెరుగని పోరాట పటిమను ప్రదర్శించాయి. తమ తమ వాదాలను, వాదనలను ప్రజల ముందు ఉంచాయి. కాంగ్రెస్ ప్రచారంలో 'గాడిద గుడ్డు' హైలైట్‌గా నిలిస్తే.. బీజేపీ 'ఆర్ఆర్ ట్యాక్స్'ను తెరపైకి తెచ్చింది! వెరసి, ఎవరి అంచనాలు వారికి ఉన్నా.. అన్ని పార్టీలూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ తొలి నుంచీ 'టార్గెట్ 14' అంటూ ముందుకు వెళుతుంటే.. ఈసారి డబుల్ డిజిట్‌ను చేరాలని బీజేపీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. చావో రేవో పోరాటంలో 14 సీట్లలో గెలిస్తే.. 'నేనూ ప్రధాని రేసులో ఉంటా' అంటూ కేసీఆర్ ఆకాశానికి నిచ్చెన వేసేశారు.

### తగ్గిన ఎన్నికల ఖర్చు

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. పార్లమెంట్ ఎన్నికల్లో ఖర్చు తక్కువగానే కనిపిస్తోంది. మండే ఎండల్లో ప్రచారం చేయాల్సి రావడంతో దాదాపు అన్ని పార్టీలూ ఉదయం, సాయంత్రమే ప్రచారానికి పరిమితమయ్యాయి. ఇంకా చెప్పాలంటే, రోడ్ షోలు, కార్నర్ మీటింగులకే పెద్దపీట వేశాయి. మరోవైపు, కొన్నిచోట్ల ఎమ్మెల్యేలూ ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొనలేదు. అసెంబ్లీ ఎన్నికలో వీధి వీధికి కనబడ్డ ప్రచార తీరు ఎంపీ ఎన్నికలొచ్చేసరికి గ్రామానికొకటి కూడా కనిపించలేదు. దీంతో, ఖర్చు నామమాత్రంగానే చేయాల్సి వచ్చింది. అలాగే, ఓట్లను గంపగుత్తగా కొనేసే పరిస్థితి నేతల్లో కనిపించలేదు. ఓటర్లకు కూడా డబ్బు పంపిణీ అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో ఇవ్వడం లేదు.

### ఒపినియన్ పోల్స్..

ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మెజారిటీ సీట్లను తామే గెలవబోతున్నామంటూ ప్రజల్ని ప్రలోభపెట్టినా.. జనం నాడి మాత్రం వేరేలా ఉంది. గత ఏడాది డిసెంబరు నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో తెలంగాణలో పలు జాతీయ చానళ్లు, సర్వే సంస్థలు ఓటరు నాడిని పసిగట్టే ప్రయత్నం చేశాయి. మెజారిటీ సర్వేలు కాంగ్రెస్ 8-10 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని ఇవ్వగా.. బీజేపీ 3-6 మధ్య, బీఆర్ఎస్‌కు 1-2, ఎంఐఎం పార్టీకి ఒక సీటు వస్తుందని అంచనా వేశాయి. ఏబీపీ న్యూస్-సీ ఓటర్ సర్వే కాంగ్రెస్‌కు 10 సీట్లివ్వగా.. ఎన్డీయేకు ఐదు, బీఆర్ఎస్, ఎంఐఎంకు చెరొకటి ఇచ్చింది. ఇండియా టు డే సర్వేలో కూడా కాంగ్రెస్‌కు పది ఇవ్వగా, ఎన్డీయేకు 3, బీఆర్ఎస్‌కు 3, ఇతరులకు ఒకటి ఇచ్చింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటరు సోమవారం తీర్పు ఇవ్వనున్నాడు. ఓటరు తీర్పు ఏమిటన్నది జూన్ 4న వెలువడనుంది!!

### కేసీఆర్ బస్సు యాత్ర

కాలుకు శస్త్ర చికిత్స జరిగినా బీఆర్ఎస్ ప్రచారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలకంగా మారారు. ఎండల నేపథ్యంలో బహిరంగ సభలకు స్వస్తి పలికి వ్యూహాత్మకంగా బస్సు యాత్ర, కార్నర్ మీటింగులకే ఓటేశారు. బీఆర్ఎస్ ప్రచారం తొలి రోజుల్లో కరెంటు కోతలను, మంచినీటి కొరతను ప్రధాన ప్రచారాస్త్రంగా తీసుకున్నా.. ఎన్నికలనాటికి కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి చెక్ చెప్పింది. కరెంటు కోతలు విధించిన అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు మంచినీటి కొరత నివారణకు ప్రణాళిక ప్రకటించింది. అనంతరం, బీఆర్ఎస్ ప్రచారమంతా కృష్ణా, గోదావరి జలాల వాటాపై నడిచింది. కృష్ణా జలాల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. ఇక, బీఆర్ఎస్ తరఫున కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్ విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ 'గాడిద గుడ్డు' ప్రచారం, బీజేపీ 'ఆర్ఆర్ ట్యాక్స్' తరహాలో నిర్దిష్ట ప్రచార శైలి కరువైంది. కాకపోతే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ పార్టీలోకి వచ్చేస్తారని కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి తదితరులు వ్యాఖ్యానించడంతో ఎన్నికలైన తర్వాత రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు బీజేపీలోకి వెళ్లిపోతారంటూ పదే పదే వ్యాఖ్యానించారు. దీనితోపాటు ఆరు హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందని, ఇది సహజంగా వచ్చిన కరువు కాదని ప్రచారం లేవనెత్తినా.. చివర్లో వర్షాలు కురవడంతో దానికి తెరపడింది.

### మోదీ చుట్టూ..

తెలంగాణలో ఈసారి డబుల్ డిజిట్‌పై కన్నేసిన బీజేపీ ప్రచారం అంతా ప్రధాని మోదీ చుట్టూ తిరిగింది. మోదీ గ్యారెంటీని చూసి ఓటు వేయాలంటూ అభ్యర్థించింది. ఒకటి రెండు సందర్భాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మినహా బీజేపీ రాష్ట్ర నేతలంతా తమ తమ నియోజకవర్గాలకే పరిమితం కాగా.. మోదీ, అమిత్ షా రాష్ట్రాన్ని పలు సందర్భాల్లో చుట్టేశారు. వివిధ నియోజకవర్గాల్లో పలువురు కేంద్ర మంత్రులు భాగస్వాములయ్యారు. నిజానికి, కాంగ్రెస్ 'గాడిద గుడ్డు ప్రచారాని'కి బీజేపీ పలు సందర్భాల్లో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తెలంగాణకు గత పదేళ్లలో తాము ఎన్ని నిధులు, ఎన్ని పథకాలు ఇచ్చామో చెప్పుకోవాల్సి వచ్చింది. అలాగే, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని మారుస్తుందనే కాంగ్రెస్ ప్రచారానికి వివరణలు ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిములకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లను రద్దు చేస్తామని, ఆ కోటాను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపకాలని మోదీ, అమిత్ షా పదే పదే స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని బీజేపీ మారుస్తుందనే ప్రచారానికి ఆ పార్టీ నేతలు దీటుగా జవాబిచ్చారు. ఇప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ మరీ ముఖ్యంగా నెహ్రూ, ఇందిర, రాజీవ్ హయాంలోనే రాజ్యాంగాన్ని ఎక్కువసార్లు మార్చారని గుర్తు చేశారు. ఇక, బీజేపీ ప్రచారంలో 'ఆర్ ఆర్ ట్యాక్స్' హైలైట్‌గా నిలిచింది. రాష్ట్రంలో రేవంత్ జాతీయ స్థాయిలోని రాహుల్ గాంధీకి కప్పం కడుతున్నారంటూ మోదీ, షా విమర్శలు గుప్పించారు. 'ఆర్ఆర్ఆర్' సినిమా వెయ్యి కోట్లు కలెక్షన్లు వసూలు చేసిందని, 'ఆర్ఆర్' ట్యాక్సు దానిని మించిపోయిందంటూ వెయ్యి కోట్లకుపైగానే కప్పం కట్టారంటూ ఆరోపించారు. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగానే మౌనం పాటించింది. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన జరిపిస్తామన్న కాంగ్రెస్ హామీతోపాటు పలువురు నాయకుల ప్రకటనలను బీజేపీ నేతలు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఇళ్ల సహా సంపదను లాగేసుకుంటారని, మహిళల మెడలో మంగళ సూత్రాలను కూడా ఉంచరని, వాటిని లాక్కుని ముస్లిములకు పంచుతారంటూ ప్రధాని మోదీ ప్రచారాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లారు. నిజానికి, అయోధ్య ఆలయం చుట్టూ ఈసారి ప్రచారాన్ని పరిమితం చేయాలని తొలుత బీజేపీ భావించినా.. చివరికి వచ్చేసరికి రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు, ముస్లిముల చుట్టూ తిప్పాల్సి వచ్చింది. వెరసి, పదేళ్లలో తెలంగాణకు తాము ఏమి చేశామన్న దానికంటే భావోద్వేగాలతో కూడిన ఈ అంశాల చుట్టూ బీజేపీ తన ప్రచారాన్ని

# సొంతూరులో ఓటేద్దాం.. చలో చలో

మొదటిపేజీ తరువాయి..

వాహనాలతో రద్దీగా మారింది. మే 13న పోలింగ్ కావడం, వరుసగా మూడు రోజులు సెలవులకారణంగా ప్రజలంతా సొంతూళ్ల బాట పట్టారు. వీకెండ్‌తో పాటు సోమవారం పోలింగ్ నేపథ్యంలో తెలుగు ప్రజలు పల్లెలకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో బస్టాండ్లకు చేరుకుంటున్నారు. ఏపీలో ఓట్ల పండుగ మొదలు కానుంది. ఎన్నికల వేళ అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్‌లో స్థిరపడిన ఓటర్లు భారీగా తరలివెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు కదులుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఓటర్లు ప్రత్యేక బస్సులు, రైళ్లలో ఊర్లకు చేరుకుంటుండగా.. ఇంకొందరు తమ సొంత వాహనాల్లోనే స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ - విజయవాడ హైవేపై రద్దీ నెలకొంది. వారాంతం, వరుస సెలవులు, పోలింగ్ కు ఇంకా రెండు రోజులే టైం ఉండడంతో శనివారం వేకువజాము నుంచే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. ఈ వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖ వైపు తరలివెళ్తున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ నేపథ్యంలో నెమ్మదిగా కదులుతున్నాయి. మరోవైపు, హైదరాబాద్ శివారు హయత్ నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెంట్ వరకూ ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. అటు, చౌటుప్పల్, పంతంగి టోల్ ఎ÷-లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. ఇప్పటికే అనేక మంది వెళ్లిపోగా.. మరికొందరు ఉదయం నుంచి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎంజీబీఎస్ వద్ద సొంతూళ్లకు ఓటు హక్కు వినియోగించు కోవడానికి వెళ్తున్న వారితో బస్టాండ్ కిక్కిరిసి పోయింది. అయితే ఆర్టీసీ సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, మహబూబ్ నగర్, ఖమ్మం, కోదాడ మార్గాల్లో సరిపడా బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లకు గురయ్యారు. నగరంలోని అన్ని బస్ స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఎంజీబీఎస్, జేబీఎస్, మియాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్ పల్లి బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. వరసగా మూడు రోజుల సెలవులు, ఓటు వినియోగం నేపథ్యంలో నగర వాసులు సొంతుళ్ల బాటపట్టారు. స్పెషల్ బస్సులు టైంకి రాకపోవడంతో ప్రయాణికులు గంటలకొద్దీ పడిగాపులుకాస్తున్న పరిస్థితి కనిపించింది. మరోవైపు ప్రైవేట్ ట్రావెల్స్‌లో చార్జీల మోత మోగుతోంది. ప్రైవేట్ ట్రావెల్స్ రద్దీని తమకు అనుకూలంగా మార్చుకుంటూ.. క్యాష్ చేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఏపీ, బెంగళూరు వెళ్లే వారికి అదనపు చార్జీలతో బాదుతున్నారు. దాదాపు 50శాతం టికెట్ రేట్లను ప్రైవేట్ ట్రావెల్స్ పెంచేశాయి. ఏసీ స్లీపర్ క్లాస్ బస్సులపై రూ.3 వేల వరకు చార్జీలను ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు పెంచేశారు. ఎన్నికల నేపథ్యంలో ఏపీలో ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఆ రాష్ట్ర ఓటర్లు స్వస్థలాలకు తరలి వెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన వారంతా అక్కడికి బయల్దేరడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. సొంత వాహనాల్లో వెళ్లేవారితో హైదరాబాద్- విజయవాడ హైవేపై పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ అవుతోంది. వారాంతం కావడం, పోలింగ్‌కు కేవలం రెండురోజులే మిగిలి ఉండటంతో శనివారం వేకువ జాము నుంచే హైవేపై భారీ రద్దీ నెలకొంది. ఆయా వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖపట్నం వైపు వెళ్తున్నాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపైకి చేరుకోవడంతో పలుచోట్ల నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. దీంతో హైదరాబాద్ శివారు హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

# ముగిసిన నాలుగోదశ ఎన్నికల ప్రచారం

మొదటిపేజీ తరువాయి..

285 లోక్‌సభ సెగ్మెంట్లలో పోలింగ్ పూర్తయ్యింది. మే13 సోమవారం రోజున నాలుగో విడతలో 10 రాష్ట్రాల్లోని 96 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఎపిలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. మొత్తం 175 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 1న సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు ఎగ్జిట్ పోల్స్ పై ఈసీ నిషేదం విధించింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో వైన్ షాపులు బంద్ అయ్యాయి. లోక్ సభ ఎన్నికల క్రమంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. పోలింగ్ జరిగే మే 13వ తేదీ సాయంత్రం వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. కల్లు కంపౌండ్‌లు కూడా ఓపెన్ కావు. పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి ఓపెన్ అవుతాయి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఈసీ ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఇక తెలంగాణ నుంచి లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 525 మంది పోటీ చేస్తున్నారు. అత్యధికంగా సికింద్రాబాద్ లో 45 మంది, ఆదిలాబాద్ లో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక ఏపీ విషయానికి వస్తే .. 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది తలపడుతుంటే 175 అసెంబ్లీ స్థానాలకు 2387మంది పోటీలో నిలిచారు. ఈ క్రమంలో

తెలుగు రాష్ట్రాల్లోలోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు, ఏపీలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకు, సమస్యాత్మక నియోజకవర్గాలైన పాలకొండ, కురుపాం, సాలూరులో 5 గంటలకు ప్రచారం నిలిపివేశారు. రాష్ట్రంలోని మిగతా 169 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు దాదాపు 90 ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.తెలంగాణలోని 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు, 13 సమస్యాత్మక సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓటింగ్‌కు నిర్దేశించిన సమయం ప్రకారమే శనివారం సాయంత్రం ప్రచారానికి గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాస, భాజపాలు అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పరస్పర విమర్శలు, ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భారాస అధ్యక్షుడు కేసీఆర్ సహా అనేకమంది ముఖ్యనేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్రంలోని 16 స్థానాల్లో మూడు ప్రధాన పార్టీలు తీవ్రంగా పోటీపడుతుండగా, హైదరాబాద్‌లో మాత్రం ఎంఐఎం కీలకంగా ఉంది. నామినేషన్ల పక్రియ ప్రారంభం కాకముందే మూడు పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించాయి.

బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, సమావేశాలు, రోడ్‌షోలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. కొన్ని ప్రాంతాల్లోనే అభ్యర్థులు ఇంటింటికీ తిరిగారు. ఎండల ప్రభావంతో ఉదయం, సాయంత్రం వేళల్లోనే నేతలు కనిపించారు. చివరి రెండు రోజులు వాతావరణం కొంత చల్లబడింది. ప్రచారంలో మాత్రం వాడీ వేడి పెరిగింది. చివరిరోజు సిఎం రేంవత్ రెడ్డి ప్రియాంకతో కలసి కామారెడ్డిలో ప్రచారం ముగించారు. కెసిఆర్ మీడియా సమావేశంతో తన ప్రచారం ముగించారు. కెటిఆర్, హరీష్ రావులు గతంలో కన్నా మిన్నగా ప్రచారంలో దూసుకుపోయారు. బిజెపి నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్, ఈటెల రాజేందర్ కూడా జోరుగా ప్రచారం నిర్వహించారు.

# 75 ఏళ్లు నిండినా.. మోదీనే ప్రధాని

మొదటిపేజీ తరువాయి..

అమెరికా, ఇజ్రాయెల్ తర్వాత సర్జికల్ స్ట్రైక్స్ చేసిన మూడో దేశం భారత్ మాత్రమే. అయితే.. భారత్ చేసిన సర్జికల్ స్ట్రైక్స్‌ను మనవాళ్లే(రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) ప్రశ్నిస్తున్నారు. దేశంలోకి చొరబడేందుకు యత్నిస్తే ఊరుకునేదిలేదు. శత్రువు భూభాగంలోకి చొచ్చుకువెళ్లి మరీ.. దాడులు చేస్తాం" అని స్పష్టం చేశారు.పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలుంటే భయపడాలా? అని ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు, 370వ అధికరణ రద్దు, సర్జికల్ స్ట్రైక్స్‌ను ఇండీ కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారని, రోహింగ్యాలను ఆహ్వానిస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా అడ్డుపడుతోందని దుయ్యబట్టారు.

### రేవంత్-రాహుల్ ట్యాక్స్

"సోనియాగాంధీ జన్మదినం రోజున రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అయితే.. సోనియా ఎన్నో పుట్టినరోజున ఆ హామీని నెరవేరుస్తారు? రైతులకు రూ 15వేల రైతు భరోసా, క్వింటా ధాన్యానికి రూ 500 బోనస్, మహిళలకు రూ.2,500 హామీలను ఎప్పుడు అమలు చేస్తారు?" అని రేవంత్‌ను అమిత్‌షా ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. హైకమాండ్‌కు ఇచ్చిన హామీ మేరకు దేశవ్యాప్తంగా ఎన్నికల కోసం తెలంగాణ నుంచి వసూలు చేసి, పంపిస్తున్నారని విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఒక్కటై.. రాష్ట్ర ప్రజలపై ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ కూడా ఆర్‌ఆర్ ట్యాక్స్‌పై విమర్శలు చేసిన విషయం తెలిసిందే..! అయితే.. ఆర్‌ఆర్ అంటే ఏమిటో ఆయన వివరించలేదు. అమిత్‌షా మాత్రం ఆర్‌ఆర్ అంటే రేవంత్-రాహుల్ ట్యాక్స్ అని స్పష్టం చేశారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలాగా మార్చుకుందని విమర్శించారు. కాళేశ్వరం మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి అవినీతి ప్రాజెక్టుగా మారిందన్నారు. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4% రిజర్వేషన్లను రద్దుచేసే ధైర్యం ఉందా? అని సీఎంకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో తమకు 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రభుత్వాన్ని నడిపేది మజ్లిస్సేనని అన్నారు. "తెలంగాణ ఆవిర్భవించినప్పుడు మిగులు బడ్జెట్‌లో ఉంది. ఈ పదేళ్లలో రూ.లక్షల కోట్ల మేర అప్పు చేశారు. ఆ నిధులన్నీ ఎక్కడికెళ్లాయి? ఏం చేశారు?" అని నిలదీశారు. బీఆర్ఎస్ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పనిచేస్తోందని ఆరోపించారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ నిర్దోషి అని కోర్టు తీర్పు ఇవ్వలేదని, మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని అమిత్‌షా గుర్తుచేశారు. దీనిని కేజ్రీవాల్ మరోవిధంగా అనుకుంటే అది ఆయన అమాయకత్వమే అవుతుందన్నారు.

### 3 దశల్లోనే బీజేపీకి 190 సీట్లు

మూడు దశల ఎన్నికల్లో బీజేపీకి 190 సీట్లను ప్రజలు కట్టబెట్టారని, తెలంగాణలో పది కంటే ఎక్కువ సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అమిత్‌షా అభిప్రాయపడ్డారు. ఎన్డీయే 400సీట్లను గెలుచుకోవడం ఖాయమన్నారు. రూ.12లక్షల కోట్ల అవినీతి చేసిన పార్టీ కాంగ్రెస్ అని.. మోదీ 23 ఏళ్లలో 25 పైసల అవినీతి కూడా చేయలేదన్నారు.

### పదేళ్లలో రాష్ట్రానికి భారీగా నిధులిచ్చాం

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ.. ఈ పదేళ్లలో ఆర్థికంగా వెనుకబాటుకు గురైందని, అయితే.. కేంద్రం భారీగా నిధులిచ్చిందని అమిత్‌షా వెల్లడించారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు అందితే.. తెలంగాణకు రూ.63 వేల కోట్లిచ్చామన్నారు. ఈ పదేళ్లలో రూ.1.62 లక్షల కోట్లను జాతీయ రహదారుల నిర్మాణాలకు, రూ.32వేల కోట్లను రైల్వే ప్రాజెక్టులకు, రూ7వేల కోట్లను విమానాశ్రయాలకు కేటాయించామని గుర్తుచేశారు. రూ.900 కోట్లతో గిరిజన వర్సిటీ, పసుపు బోర్డును కేటాయించామన్నారు. రూ.6,500 కోట్లతో రామగుండంలో ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభిమచామని చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎంని మించి తెలంగాణకు రూ.9వేలకోట్లు రుణం ఇచ్చినందుకు మోదీకి రేవంత్ ధన్యవాదాలు చెప్పాలన్నారు. ఈ నిధులు రాంటే.. ఉద్యోగులకు జీతాలూ చెల్లించలేకపోయేవారన్నారు. తాము పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 11 నుంచి 5వ స్థానానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ పదేళ్లుగా ఉందని, రిజర్వేషన్లను తొలగించాలనుకుంటే ఎప్పుడో చేసేవారిమని వ్యాఖ్యానించారు. తమకు అలాంటి ఉద్దేశమే లేదన్నారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్‌నే ఆశీర్వదించండి

మొదటిపేజీ తరువాయి..

కుట్ర చేస్తోంది. రిజర్వేషన్ల రహిత దేశంగా మార్చాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆశీర్వదించండి' అని రేవంత్ కోరారు.

# రాజ్యాంగాన్ని మార్చడమే బిజెపి లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

లక్ష మెజారిటీతో మధును గెలిపించాలని కోరారు. బిజెపికి పిచ్చిపట్టిందని,హిందూ ముస్లింలు పొడుకుని రక్తం పారిస్తే తద్వారా ఆ పార్టీ సీట్లను గెలుచుకోచూస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెదక్ ప్రాంతంలో మౌళిక వసతులు సరిగా లేవని, ఈ ప్రాంతానికి గోదావరి నీళు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా, మాదిగల వర్గీకరణ జరగాలన్న, ముదిరాజ్ కులస్తులను బిసి-డి గ్రూప్ నుంచి బిసి-ఏ గ్రూపులోకి మారాలన్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాలని భాజపా యత్నిస్తోందని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలుంటేనే పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. భారాస హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో అభివృద్ధి జరగలేదన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. పటాన్ చెరు ఒక మినీ ఇండియా అని అన్నారు. అన్ని కులాలు,మతాలకు అతీతంగా దేశానికే ఉత్పత్తిని అందిస్తోంది పారిశ్రామిక వాడ. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ నీళ్లు కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్ రామిరెడ్డి వేలాది మంది రైతులను మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌లో నిండా ముంచిన దుర్మార్గుడని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉంటూనే కేసీఆర్ మళ్లీ ఎంపీగా కొట్లాడటం విడ్డూరమన్నారు. వందల కోట్ల రూపాయలు కేసీఆర్‌కు, హరీశ్ కు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణకు ఇచ్చేందేమీ లేదన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ..ఇవేవీ తెలంగాణకు ఇవ్వలేదన్నారు. గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. బీజేపీ హిందూ,ముస్లీం ఓట్లను చీల్చి రక్తంలో ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. మెదక్ అభివృద్ధి జరగాలంటే పెట్టుబడులు రావాలన్నారు. నీలం మధును మెదక్ నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. బడుగు బలహీన వర్గాల గొంతుకను పార్లమెంట్ కు పంపించాలని పిలుపు నిచ్చారు.

# కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోబోతోంది

మొదటిపేజీ తరువాయి..

పార్టీ భారీ మూల్యం చెల్లించబోతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అది ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా కనిపిస్తుంది. రాజకీయ అనుభవం తోనే ఇది చెబుతున్నా. అధికారంలో ఉన్న పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వస్తే, సరూర్‌నగర్ స్టేడియంలో అభాసుపాలయ్యారు. మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన జరిగిన సభకు కనీసం మూడు వేల మంది కూడా రాలేదు. సీఎం సభల్లోనూ ఖాళీ కుర్చీలు దర్శన మిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న చొరవ ఇప్పుడు కనించలేదు. రాష్ట్రం దివాలా తీసిందనే వ్యాఖ్యలు ఏ ముఖ్యమంత్రి చేయడు. అది రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ప్రయోజనాలు దెబ్బతీస్తుందని భారాస అధినేత కేసీఆర్ ధ్వజమెత్తారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు కాటేయబోతున్నారని కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని కాటేయడం ఖాయం.. అందులో ఎలాంటి అనుమానం లేదు.. ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 17 రోజుల బస్సు యాత్ర చేపట్టాను. ఆ తర్వాత జనం నుంచి వచ్చిన స్పందనలు, మధ్యాహ్నం సమయంలో జనం ఇచ్చిన సమాచారం ద్వారా తెలుస్తున్నది ఏందంటే ఈ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలను మించి ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్ అద్భుతంగా గెలవబోతుంది. ఇందులో సందేహం లేదు. ఈ రెండు ప్రభుత్వాల ఆచరణ, అవలంబించిన తప్పుడు విధానాలు ప్రజల్లోకి వెళ్లాయి. వాటిని మేం చెప్పగలిగాం. దాని ఫలితమే బీఆర్ఎస్ అద్భుతమైన విజయం సాధించబోతుంది అని కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అర్భక ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం చాలా తప్పులు చేసింది. ఎప్పుడు కానీ ఇంతకుముందు ఉన్న ప్రభుత్వం మారి వేరే ప్రభుత్వం కొలువు దీరినప్పుడు గత ప్రభుత్వం ఏ విధానాలో అవలంబించిందో అంతర్గ సమిక్షలు చేసి మెరుగైన పనితనం చూపించాలి. ఇది సహజంగా కనిపించేదే. భిన్నంగా అసహజమైన పద్ధతుల్లో ఒక పాలసీ లేకుండా, రైతులు, ఇండస్ట్రీ, పవర్, ఇరిగేషన్ సెక్టార్‌ను పక్కన పెట్టి అమూల్యమైన సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వేస్ట్ చేశారు. శాసనసభలో కూడా చిలిపి

ప్రయత్నాలు చేశారని అన్నారు. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు. ఆ ఆగ్రహంతో పార్టీని ముంచేయడం ఖాయం అని కేసీఆర్ అన్నారు. స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మీద కోపంతో తమ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ ఆపలేదు కదా..? ఆ రెండు పథకాలకు అదనపు నిధులు కేటాయించి ముందుకు తీసుకెళ్లామని కేసీఆర్ తెలిపారు. ఈ రెండు పథకాల వల్ల ఎంతో మందికి లబ్ధి చేకూరిందని కేసీఆర్ స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆశించే దృష్ట్యా రాష్ట్రం బాగుందని చెప్పాలి. నేను సీఎం అయ్యాక తెలంగాణ ధనిక రాష్ట్రం అని చెప్పి నిరూపించాను. ధనిక రాష్ట్రమని చెబుతూ ఆ దిశగా పయనిస్తూ అద్భుత విజయం సాధించాను. శాసనసభలో శ్వేతపత్రాలతో తప్పుడు అంకెలు, లెక్కలతో కాలయాపన చేసి భంగపడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడక ముందు అనేక వ్యవస్థలు చాలా చక్కగా పని చేశాయని కేసీఆర్ పేర్కొన్నారు.నేను సీఎం అయ్యాక హెల్త్ డిపార్ట్‌మెంట్ రివ్యూ చేశాం. ఆరోగ్య శ్రీ వివరాలు చెప్పారు. ఇది రాజవేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభించింది. ప్రజలకు ఉపయోగం ఉందని చెప్పారు. దీన్ని ఇంప్రూవ్ చేయాలంటే ఎంత మనీ అవసరమో తీసుకుని పేరును కూడా మార్చొద్దు అని చెప్పాను. విద్యాశాఖ రివ్యూలో కూడా రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఫీజు రియింబర్స్‌మెంట్ గురించి చెప్పారు. మంచి కార్యక్రమం కానీ అవకతవకలు ఉన్నాయన్నారు. వాటిని సరిదిద్దాలని చెప్పాను. పథకాన్ని నిలపొద్దు.. అడిషనల్ మనీ తీసుకోవాలని చెప్పాను. ఏ ప్రభుత్వం పెట్టిన కార్యక్రమం కార్యక్రమమే. తెలంగాణ వ్యతిరేకి అయినప్పటికీ కూడా ఆ మహనీయుడు చచ్చి స్వర్గంలో ఉన్నప్పటికీ మంచి పథకం పెట్టిండు అని చెప్పి ఆరోగ్య శ్రీ కార్యక్రమాన్ని అమలు చేశాం. ఈ పథకంలో మరిన్ని రోగాలను యాడ్ చేశాం. మంచి పద్ధతుల్లో కొనసాగిస్తాం అని చెప్పాం. కానీ కాంగ్రెస్ లాగా చెరిపేస్తామని చెప్పలేదు. అది కంటిన్యూ చేశాం. ఫీజు రియింబర్స్‌మెంట్ చేశాం. కానీ ఈ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయకుండా దెబ్బతీసుకుంది. బేషజాలకు పోయి వాళ్ల కాళ్లు వాళ్లే విరగొట్టుకున్నారు అని కేసీఆర్ పేర్కొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

మొదటిపేజీ తరువాయి..

రవిగుప్తా. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిపిన తనిఖీల్లో 184 కోట్ల విలువైన నగదు మద్యం డ్రగ్స్ పట్టుబడ్డాయన్నారు. ఎన్నికల పక్రియకు ఆటంకం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల పర్యవేక్షణ కొరకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. చివరి ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌కు చేరేంతవరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని అన్నారు.

శనివారం డీజీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా మీడియాతో మాట్లాడుతూ... మద్యం అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రత్యేకంగా మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. మార్చి 16న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిపిన తనిఖీల్లో రూ. 184 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడ్డాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా 34,526 మందిని బైండోవర్ చేశామని అన్నారు. పోలింగ్ పక్రియకు ఆటంకం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల పర్యవేక్షణ కొరకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. చివరి ఈవీఎం స్టాం÷-రగ్ రూముకు చేరేంతవరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని డీజీపీ రవిగుప్తా పేర్కొన్నారు.

# ప్రతిపక్షహోదా కూడా... కాంగ్రెస్‌కు దక్కదు

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్‌కు విపక్షంలో కూర్చునేందుకు అవసరమైన సీట్లు కూడా రావు. 50 కంటే తక్కువ సీట్లే వారికి వస్తాయి' అని మోదీ అన్నారు. ఒడిశా ప్రజలు తన పట్ల అపారమైన ప్రేమ, మద్దతు కనబరుస్తున్నారని, ప్రజలు తనమీద ఉన్న నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా నిస్వార్థ సేవ చేస్తానని ప్రధాని హామీ ఇచ్చారు. 26 ఏళ్ల క్రితం ఈరోజే అటల్ బిహార్ వాజ్‌పేయి ఇక్కడ పోఖ్రాన్ పరీక్ష నిర్వహించారని, అది ప్రపంచంలోని భారతీయులందరికీ గర్వకారణమైందని గుర్తు చేశారు. ప్రపంచానికి భారతదేశ సత్తాను తొలిసారి చాటిన సందర్భమిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం పాకిస్థాన్ దగ్గర కూడా అణుశక్తి ఉందంటూ భారతీయుల మనసుల్లో భయాలు నాటుతోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ హయాంలో ఉగ్రదాడులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఓటు బ్యాంకు భయాలే అందుకు కారణమమని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ బలహీనమైన మైండ్‌సెట్ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు దశాబ్దాలుగా బాధితులయ్యారని అన్నారు. 26/11 దాడుల తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు భయాలతో ఎలాంటి దర్యాప్తు జరిపించలేదన్నారు. వికసిత్ భారత్‌లో వికసిత్ ఒడిశా కోసం ప్రజల ఓటు చాలా ముఖ్యమని, మీ ఒక్క ఓటుతో ఇక్కడ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కమలం బటన్ నొక్కి బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని మోదీ పిలుపునిచ్చారు.



## కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మే 11 (నమస్తే ఉదయం):** చేవెళ్లలో బడుగు, బలహీన వర్గాల గొంతుక జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలవడం ఖాయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గట్టయ్య ఆధ్వర్యంలో 200 మంది మహిళలు ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని టిఆర్ఎస్ కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...పార్టీ కష్టకాలంలో ఉంటే తానున్నానని ముందుకు వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మోదీ, రంజిత్‌రెడ్డికి రేవంత్ అండగా ఉంటే.. కాసానికి అండగా.. కేసీఆర్, తెలంగాణ ప్రజానీకం ఉన్నదన్నారు. పార్టీ తరపున రంజిత్‌రెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డిలను ఎంపీలుగా చేస్తే మోసం చేశారన్నారు.

వీరు బీఆర్ఎస్ శ్రేణులను చాలా తక్కువగా అంచనా వేస్తున్నారన్నారు. మోదీ, రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని వాళ్లు విర్రవీగుతున్నారని.. వారికి తగిన శాస్తి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో శ్రీలత, యాదమ్మ, సువర్ణ, మంజుల, జంగమ్మ, రేణుక, మహాలక్ష్మి, ధనలక్ష్మి, వాసవి, స్వప్న, అరుణ, రాధిక తదితరులు ఉన్నారు.

## మల్కాజ్ గిరి సీటును ప్రజలందరి అభిమానంతో తిరిగి నిలబెట్టుకుంటాం

**- నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్...**

**రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దాం... సునీతమ్మను గెలిపిద్దాం...**

**రాజ్యాంగాన్ని కాపాడుకుందాం:**

**టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం...**

**కూకట్‌పల్లి, మే 11 (నమస్తే ఉదయం):**
పార్లమెంటు ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్ బి డివిజన్ లోని వసంత నగర్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, సిబిసిఐడి కాలనీలలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం రోడ్ షో



నిర్వహించారు. అనంతరం బాలానగర్ డివిజన్ లో పాదయాత్ర నిర్వహించి, బాలాజీ నగర్ డివిజన్ లో డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలిచిన మల్కాజ్ గిరి సీటును ప్రజలందరి అభిమానంతో తిరిగి నిలబెట్టుకుంటాం అన్నారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సోమవారం జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక సీట్లు గెలిచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి సునీతమ్మను భారీ మెజారిటితో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించండి

**బుద్వేల్, మే11 (నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజయిన శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, మైలార్ దేవ్ పల్లి డివిజన్‌లలో ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో ఆ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ పలుగు చెరువు



మహేష్, డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రంజిత్ రెడ్డిని చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కోరారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని అన్నారు. దేశంలో ప్రజలందరికి సమాన హక్కులు , స్వేచ్ఛ ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాలన్నారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు పి ఉమామహేశ్వరి, దుంబాల ఝాన్సీ రెడ్డి తోపాటు పెద్ద ఎత్తున ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌లో.....

మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో అపార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి , డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనుంజయ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలను కలియ తిరుగుతూ సాగిన బైక్ ర్యాలీ లో వందల మంది కార్యకర్తలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి , నాయకులు ఆడికె అర్జున్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి..

**ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి..**

**రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక**

**రాజేంద్రనగర్,మే11(నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ లో ప్రతి ఓటరు పాలుపంచుకుని స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చేవెళ్ళ పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక తెలిపారు.పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. శనివారం రాజేంద్రనగర్ లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చేవెళ్ళ డిసిపి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ శశాంక పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి వివరాలను వెల్లడించారు. సందర్భంగా శశాంక మాట్లాడుతూ...ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.ఓటరు కార్డు లేకపోయినా,ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర 13 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదానిని వెంట తెచ్చుకుని ఓటు వేయవచ్చని సూచించారు.ఈ నెల 13వ తేదీన ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని,వాస్తవానికి ప్రతీసారి సాయంత్రం 5.00 గంటల వరకే పోలింగ్ గడువు ముగిసేదని, ఈసారి దానిని మరో గంట పాటు పొడిగించడం జరిగిందన్నారు.నిర్ణీత సమయంలోపు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన వారికి సైతం ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్య ప్రాధాన్యతను చాటి చెప్పాలని సూచించారు.జిల్లాలో పోలింగ్ శాతం పెంపొందించేందుకు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రచార,అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు.ప్రత్యేకించి ఇదివరకటి ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన అర్బన్ ప్రాంతాలలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం జరిగిందన్నారు.ఓటర్లకు 99.23 శాతం మేరకు ఓటరు సమాచార స్లిప్పులను బీ.ఎల్.ఓల నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారని చెప్పారు. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ కు 72 గంటల ముందు నుండి నిఘాను ముమ్మరం చేయించామని,నిఘా బృందాల సంఖ్యను రెట్టింపు చేసి విస్తృత తనిఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు.నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్)గా పరిగణించబడే పోలింగ్ కు 48 గంటల ముందు ప్రచార కార్యక్రమాలు నిషేధమని, రాజకీయ ప్రకటనలు ప్రచురించదల్చిన వారు కూడ ముందస్తుగా ఎం.సీ.ఎం.సీ ద్వారా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 2877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు నీడ అందించేలా టెంట్లు,టాయిలెట్,ర్యాంపు,వీల్ చైర్,తాగు నీరు,ఫ్యాన్ వంటి వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమస్యాత్మక,అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా,సీ.సీ కెమెరాల నిఘా నీడలో పోలింగ్ జరిపేలా ఏర్పాట్లు చేశామన్నారు.అంతే కాకుండా, 216 మంది సూక్ష్మ



మీడియాతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, చిత్రంలో రాజేంద్రనగర్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్

పరిశీలకులు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సేవలందిస్తారని తెలిపారు.కాగా చేవెళ్ళ లోక్ సభ నియోజకవర్గంలో మొత్తం 29 లక్షల 38 వేల 370 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.గత అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా ఎలక్షన్ కమిషన్ 85 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్లు,దివ్యంగ ఓటర్లకు ఇంటి నుండే ఓటు వేసేందుకు వీలుగా వెసులుబాటు కల్పించిందని,ఈ మేరకు జిల్లాలో 994 మంది తమ తమ ఇంటి వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ర్యాండమైజెషన్ ద్వారా ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలను తరలించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరచడం జరిగిందని,ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.పోటీలో 43 మంది అభ్యర్థులు ఉన్నందున పోలింగ్ కోసం మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నామని అన్నారు.పోలింగ్ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా లెక్కిస్తూ (రిజర్వు) బ్యాలెట్ యూనిట్లు 10757, కంట్రోల్ యూనిట్లను 3591 కేటాయించడం జరిగిందని,వి.వి.ప్యాట్లు 4008 కేటాయించామని అన్నారు.పోలింగ్ నిర్వహణ కోసం పీ.ఓలు,ఏ.పీ.ఓలు, ఓ.పీ.ఓలతో కూడిన బృందాల ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని, పోలింగ్ సామాగ్రితో ఆదివారం ఈ బృందాలు తమకు కేటాయించబడిన పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారని తెలిపారు. ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు వీలుగా (256) సెక్టార్లను ఏర్పాటు చేస్తూ,ఎస్.ఎస్.టీ,ఎఫ్.ఎస్.టీ బృందాలను నియమించామని,ఎన్నికలు ముగిసేంత వరకు అనుక్షణం ఈ బృందాలు నిఘా ఉంచుతాయని అన్నారు.సైలెన్స్ పీరియడ్ కు సంబంధించిన నిబంధనలు తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు.శేరిలింగంపల్లి నియోజక వర్గానికి సంబంధించి జిఎంసి బాలయోగి స్పోర్ట్స్ స్టేడియంలో,మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి గుర్రంగూడలోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజ్‌లో,రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నందు డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ సెంటర్, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వికారాబాద్‌లోని మేరీ ఎ.నాట్స్ స్కూల్ నందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తాండూర్ లోని సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ హైస్కూల్ నందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్,పరిగి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పరిగిలోని మినీ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలు:**

**రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్**

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నామని,ఐదెంచెల బందోబస్తు ఏర్పాట్లు ఉంటాయని,సెక్టార్ ఆఫీసర్సు,పోలీసు బృందాలతో కూడిన టీములు,క్విక్ రెస్పాన్స్ టీములు,ఎ.సి.పి.ల స్థాయిలో స్ట్రైకింగ్ ఫోర్సు,డిసిపి,సిపి,ఎడిజి స్థాయిలలో పర్యవేక్షణ ఉంటుందని డీసీపీ శ్రీనివాస్ వివరించారు.చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఇప్పటి వరకు చేవెళ్ళ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో రూ.10 కోట్ల 70 లక్షల 16 వేల 937 నగదు,రూ.1,76,12,006 లక్షల విలువ చేసే మద్యం,రూ. 5,05,03,026 విలువ చేసే 1846.8203 కిలోల గంజాయి,రూ. 31,14,44,388 విలువ చేసే బంగారు,30,34,700 విలువ చేసే సిల్వర్ ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని,శనివారం సాయంత్రం 6 గంటల అనంతరం బహిరంగ ప్రచారం నిషేధమని స్పష్టం చేశారు. బల్క్ ఎస్ఎంఎస్ లు,వాయిస్ మెస్సేజ్ లు,రికార్డెడ్ వాయిస్‌లు పంపడం, బాణాసంచా కాల్చడం నిషేధమని,స్థానికేతరులు తమతమ ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బంది,ఓటర్లు మినహా ఇతరులెవరూ లోనికి వెళ్లకూడదని,అభ్యర్థులు, ఏజెంట్లు కూడా నిబంధనలను పాటించాలని సూచించారు.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

## మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి..

**ఎనిమిది అసెంబ్లీ పరిధిలో మొత్తం 3459 పోలింగ్ కేంద్రాలు..మొత్తం 3796 టీములు**

**పర్యవేక్షించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు..**

**రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక**



**రాజేంద్రనగర్,మే11(నమస్తే ఉదయం):**
ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు.శనివారం రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజెషన్ ప్రక్రియ నిర్వహించారు.సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా ర్యాండమైజెషన్ ను నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్,సహాయ ప్రిసైడింగ్ అధికారులను,ఓ.పీ.ఓలతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం కలెక్టర్ శశాంక పరిశీలకుల దృష్టికి తెచ్చారు.జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ పరిధిలో మొత్తం 3459 పోలింగ్ కేంద్రాలు ఉండగా,మొత్తం 3796 టీములను పోలింగ్ విధుల కోసం నియమించడం జరిగిందన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను,ఒక దివ్యాంగుల బృందం,ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు.ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజెషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో డీఆర్ఓ సంగీత,ఎన్ఐసి అధికారి స్వర్ణలత,మ్యాన్ పవర్ మ్యానేజ్మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి,ఎన్నికల విభాగం అధికారి సైదులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించి ఢిల్లీ స్థాయిలో సీఎం ప్రతిష్ట పెంచుదాం...

**గెలిచేది కాంగ్రెస్..**

**చివరి రోజు హోరెత్తిన ప్రచారం:డివిజన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్,మే 11(నమస్తే ఉదయం):**
చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి గెలుపును కోరుతూ రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవులపల్లి డివిజన్ పరిధిలో పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి.డివిజన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ వీధుల గుండా ర్యాలీ సాగింది.పార్టీ కార్యకర్తలు బైక్‌లపై వెళ్లగా,డివిజన్ కోఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి ఓపెన్‌టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు.కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలను పట్టుకుని సందడి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకగా గడ్డం రంజిత్ రెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.భారీ మెజార్టీతో గెలిపించి ఢిల్లీ స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టను పెంచుదామని తెలిపారు.
మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి,ఒక



రాక్షసుని పాలనను పాతర చేసింద్రని,ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించి, మతోన్మాదం శక్తులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేసిన ఫలితంగా కాంగ్రెస్ పార్టీనీ గెలిపించవలసిందిగా కోరారు.దేశ భవిష్యత్తు భావితరాలకు కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీనీ ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసే హస్తం గుర్తుపై ఓటు వేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.రేవంత్ రెడ్డికి మనం అండగా నిలిచి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేయలేక అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తుందని మండిపడ్డారు. మతకల్లోలలతో ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో రంజిత్ రెడ్డి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సదాలక్ష్మి,సరికొండ వెంకటేష్,ఆడికి అర్జున్,సానెం జీవన్ గౌడ్,ధనంజయ,సూరెడ్డి సాయి రెడ్డి,సిహెచ్ కృష్ణ గౌడ్,ఓం ప్రకాష్,శ్రీనివాస్,బొల్లా వెంకటేష్, మహమ్మద్ ఖాదర్,తదితరులు పాల్గొన్నారు.

## పత్తాలేని బీఆర్ఎస్... కాంగ్రెస్‌కు ఓటమి ఖాయం

**చేవెళ్ళ గడ్డపై కాషాయ జెండా ఎదరడం ఖాయం:**

**బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్**

**రాజేంద్రనగర్,మే11 (నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా మునిగిపోవడం ఖాయమని రాజేంద్రనగర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అన్నారు.పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్ లో ఇంటింటి విస్తృతంగా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లా డుతూ... పార్లమెంటు దేశంలోని అన్ని వ్యవస్థలను కాంగ్రెస్ పార్టీ నాశనం చేసిందని ఆరోపించారు.బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది..కాంగ్రెస్ పని ఖతమైంది..మూడోసారి మోదీ



ప్రేమావతి పేట లో ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న అసెంబ్లీ బిజెపి కన్వీనర్ మల్లేష్ యాదవ్

ప్రధాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ రోజు దేశం ముందంజలో అంతర్జాతీయ స్థాయిలో శాసించే స్థానంలో ఉందంటే అందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు.మూడోసారి కేంద్రంలో గతం కన్నా ఎక్కువ మెజారిటీ సీట్లతో బిజెపి రికార్డు స్థాయిలో సాధించి అందులో చేవెళ్ళ గెలుపు ఖాయమన్నారు.దేశం,ధర్మం కోసం పని చేసే గొప్ప యంత్రాంగం బిజెపికీ సొంతమని కొనియాడారు. ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా కాబోతు న్నారని, కేంద్రంలో బీజేపీ ప్రధానిగా మోదీ సర్కార్ ఉంటేనే దేశపురోభివృద్ధిని సాధిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భవాని దాస్,రఘు ముదిరాజ్, శేఖర్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చేవెళ్లలో గడ్డ టిఆర్ఎస్ అడ్డ

**- ఈదుల నరసింహా గౌడ్**

**శంషాబాద్. మే 11(నమస్తే ఉదయం):** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీకి అడ్డా అని ఇక్కడ టిఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించబోతుందని మధుర నగర్ టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదుల నరసింహా గౌడ్ అన్నారు. మెజారిటీ శనివారం మధుర నగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కేవలం ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు ప్రత్యామ్నాయంగా మళ్ళీ టిఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి జ్ఞానేశ్వర్ ముదిరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని ఈదుల నరసింహా గౌడ్ విజ్ఞప్తి చేశారు ప్రచార కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి. కోఅప్షన్ మెంబెర్ చేవెళ్ల కవితప్రసాద్. సీనియర్ నాయకులు తోట రాములు. గుంటి రవి. తోటవిట్టల్. కమ్మరిశ్రీశైలం. మిద్దె మోహనరెడ్డి. గొంగడి రవి. జెల్లపల్లి శ్రీనివాస్ సామ చెన్నారెడ్డి. వీరేశం. కంది ప్రభాకర్. మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీగా రంజిత్ రెడ్డిని గెలిపించండి:బద్రు నాయక్

**శంషాబాద్. మే 11(నమస్తే ఉదయం):**
చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శాతం రాయి. చారి నగర్ గ్రామాలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శాతం రాయి కౌన్సిలర్ ఆంగోతు బద్రు నాయక్ ఆధ్వర్యంలో హస్తం



గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా రని ఆయనకు మరో అవకాశం కల్పిస్తే పార్లమెంటులో ఈ ప్రాంత సమస్యలను ప్రస్తావించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను రంజిత్ రెడ్డి పూర్తి చేయించారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుగంటి యాదయ్య. భవాని మల్లేష్. బండి జగదీష్. కావలి జంగయ్య. మల్లారెడ్డి. పాపారావు. ఆలేటి నరసింహ. ముఖేష్.యూత్ విభాగం నాయకులు తరుణ్. పాండు నాయక్.. రవి నాయక్. పాత్లవర్ చందర్..శివుడు. నరేష్. ఆంగోతు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డి

## భారీ మెజారిటీతో గెలిపిస్థాం..

**- బి.లలితా రెడ్డి**

**రాజేంద్రనగర్, మే11(నమస్తే ఉదయం):** చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బి లలితా రెడ్డి అన్నారు. శనివారం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి గూడ రాజీవ్ గృహకల్ప ఫేస్ -1 లో



రాజీవ్ గృహకల్ప ఫేస్ -1లో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు బి లలితా రెడ్డి

కాంగ్రెస్ నాయకురాల్లు రాధిక,అలివేలమ్మ, నవనీత,ఉమాదేవిలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఈ సందర్భంగా లలితా రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తూ పేదల సంక్షేమం కోసం కృషి డాక్టర్ రంజిత్ రెడ్డి గత ఐదేళ్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు.

# నేటి నుంచి వైన్‌షాపులు బంద్..

**హైదరాబాద్ : మే 11(నమస్తే ఉదయం):**
తెలంగాణ మందుబాబులకు కిక్ దిగే వార్త లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రెండు రోజులు వైన్‌షాపులు మూసివేయనున్నారు.
13వ తేదీ ఓటింగ్ జరగను న్న నేపథ్యంలో మద్యం అమ్మకాల పై నిషేధం విధించారు ఎన్నికల అధికారులు. దీంతో నేటి నుండి 13 వ తేదీ వరకు మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు.




ఎన్నికల అధికారులు. ఇవా ళ సాయంత్రం 5 గంటల నుండి 13 వ తేదీ పోలింగ్ ముగిసే వరకు వైన్‌షాప్‌లు క్లోజ్. పోలింగ్ పూర్తిగా ముగిసిన తరువాతే తెరుచుకోనున్నాయి.
కాగా, ఇవాళ ఎన్నికల ప్రచారానికి ఇవాలే రోజు. ఈ రోజు నాల్గో విడత ఎన్నికల ప్రచారానికి చివరి రోజు అయింది.. ఈ రోజు సాయంత్రం 5 గంటల తో మూతపడ్డాయి. ఎన్నికల ప్రచారం.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు నాల్గో విడతలో 10 రాష్ట్రాల్లో ఎన్నికలను నిర్వహించనుంది ఈసీ. మొత్తం 10 రాష్ట్రాల్లో 96 పార్లమెం ట్ నియోజకవర్గాల్లో మే 13న పోలింగ్ జరుగ నుంది.

# కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం..

**చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం..**

**- సీఎం సోదరుడు కొండల్ రెడ్డి**

**రాజేంద్రనగర్,మే11 (నమస్తే ఉదయం):**
పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్?రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్? ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం సోదరుడు కొండల్ రెడ్డి అన్నారు.పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పలుకు చెరువు మహేష్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.బైక్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండల్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వివరించారు. ఇప్పటికే మూడు గ్యారంటీలైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల విద్యుత్ ఉచితం, రూ.500 వందలకే గ్యాస్ అమలు చేస్తున్నామని తెలిపారు.మిగతా మూడు గ్యారంటీలు రైతు రుణమాఫీ,ఇందిరమ్మ ఇండ్లు,నూతన రేషన్ కార్డులు ఎన్నికల తరువాత అమలు చేస్తామని
తెలియజేశారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి బీజేపీ, బీఆర్ఎసలు ఓర్వలేకపోతున్నా యని అన్నారు..రాష్ట్రంలో గడీల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని,ప్రజలందరికి స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు.




గతంలో బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సమస్యలు చెప్పుకోవాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం నేరుగా మంత్రులు ముఖ్యమంత్రులతో కూడా తమ సమస్యలు చెప్పి పరిష్కరించుకునే వెసులుబాటు కలిగిందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్ రెడ్డికి చేయి గుర్తుకు మీ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కొండల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాత్రమే ఉందని,కాంగ్రెస్ వస్తే అభివృద్ధి జరుగుతుందని అన్నారు.ఆగస్ట్ 15 లోపు రుణమాఫీ చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను యూపీఏ ప్రభుత్వం రాగానే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, సోనియగాంధీ అని తెలిపారు.మత పరంగా ఆలోచన చేసే పార్టీ కావాలా..సంక్షేమం చేసే పార్టీ కావాలా ఆలోచించాలని ఓటర్లకు సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి రంజిత్ రెడ్డి ని గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్ రాజ్, లలిత్ వర్రీ,రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి,డివిజన్ గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్,ప్రవీణ్ యదవ్,సాయి ముదిరాజ్, భారత్ రెడ్డి, శ్యాం,ఉమా మహేశ్వరి,పెంద్యాల శ్రీధర్, మహేందర్,విశాల్,మహేష్,సురేష్,సుభాష్,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్

## గట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 11(నమస్తే ఉదయం):**
ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలో జెడ్పి చైర్ పర్సన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరిత తిరుపతయ్య అధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అన్నారు.

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానాలను నాశనం చేసి ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిన రాష్ట్రాన్ని అప్పుల ఊబి లోకి దింపారని ఆరోపించారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ఈ రాష్ట్రంలో ఒక లక్ష కోట్ల రూపాలు వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళలను ఆదుకుంటామన్నారు. నడిగడ్డ ప్రాంతంలో పెండింగ్ లో ఉన్న గట్టు ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సంపద అంత ఆదానీ, రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ కు లేదన్నారు

**నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి మల్లు రవి మాట్లాడుతూ..**

పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని,మెజారిటీ స్థానాల్లో గెలిచి సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండని 100 రోజుల్లోనే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కిందని చెప్పారు. ప్రతి ఒక్క కాంగ్రెస్






ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఎంపి అభ్యర్థి మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సినీ నిర్మాత బండ్ల గణేష్, గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.ఎస్.కేశవ్ హాజరయ్యారు. ధరూర్ రింగ్ రోడ్డు నుంచి పాతబస్టాండ్ వరక రోడ్డు షో కొనసాగింది. అనంతరం పాత బస్టాండ్ నందు వైఎస్ఆర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ....**

విభజన హామీలు మరిచిన బిజెపి పార్టీని బొందపెట్టి ప్రజాస్వామ్య పరిరక్షణకై కాంగ్రెస్ పార్టీని గెలుపించుకోవాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేయడానికి కుట్రలు పన్నుతూ రాజ్యాంగాన్ని మర్చి రిజర్వేషన్లు తొలగించ డానికే 400 సీట్లు అడుగుతుందని,అలాంటి పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసే భాధ్యత నడిగడ్డ ప్రజలందరిదని అంబానీలకు దోచిపెట్టి ఇచ్చారని, అలాంటి బీజేపీ ప్రభుత్వాన్ని బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలుపించాలని పిలుపునిచ్చారు.

**జెడ్పి చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరిత మాట్లాడుతూ.**

కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ ల గురించి బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు గొంతు చించుకుంటున్నాయని,కేంద్రంలో ఉన్న బిజెపి ఒక్కొక్కరి ఖాతాలో జన్ దన్ యోజన్ కింద రూ.15 లక్షలు వేస్తామని, రెండు కోట్ల ఉద్యోగలు ఇస్తామని నమ్మబలికిన బిజెపికి, రూ.3016 రూపాయల నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇల్లు, రైతు రుణమాఫీ చేయని బిఆర్ఎస్ పార్టీ దిగజారుడు నాయకుడు, కార్యకర్త భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పని చేసి నాగర్ కర్నూల్ అభ్యర్థి మల్లు రవి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గట్టు తిమ్మప్ప, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి,గంజిపేట్ శంకర్, ధరూర్ జెడ్పిటిసి పద్మ వెంకటేశ్వర రెడ్డి,మధుసూదన్ బాబు,ఇసాక్, అమరావాయి కృష్ణారెడ్డి,నల్లారెడ్డి,గోనుపాడు శ్రీనివాస్ గౌడ్,లత్తిపురం వెంకట్రామిరెడ్డి, అల్వాల రాజశేఖరరెడ్డి, ఆనంద్ గౌడ్, గట్టు కృష్ణమూర్తి కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, ,సిపిఐ ఆంజనేయులు, సిపిఎం వెంకటస్వామి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కేసీఆర్ హయంలోనే తెలంగాణ అభివృద్ధి

**- మాజీ ఎంపీ మంద జగన్నాథం**

**గద్వాల ప్రతినిధి, మే 11 (నమస్తే ఉదయం):**
చరిత్ర లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందని మాజీ ఎంపీ మంద జగన్నాథం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో పాటు ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......రేవంత్ రెడ్డి అలవికాని హామీ లు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి అదికారం లోకి రావడం జరిగిందని విమర్శించారు.రేవంత్ రెడ్డి అహంకార మాటలు ,అహంభావం తో వ్యక్తి గత దూషణలు,కక్ష సాధింపు చర్యలకే పాల్పడుతున్నడని ఇంతవరకు పాలన పై పట్టు సాధించలేదని అన్నారు. ఆరు గ్యారెంటీ లు,11 వాగ్దానాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ఇంత వరకు ఆములు నోచుకోలేదని విమర్శించారు. త్రాగునీరు,సాగు నీరు, నాణ్యమైన విద్యుత్ కేసీఆర్ కె సాధ్యమని తెలంగాణ రాష్ట్రం లో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విద్యావంతుడు బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్తి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కు మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమం లో మురళి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణ రెడ్డి, రమేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.